
సాక్షి
పల్నాడు
ఆదివారం । 12 । జనవరి । 2025





## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1818, హై లెవల్ కాలువకు 80 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.



## వైభవంగా కూడారై ఉత్సవం

ఫిరంగిపురం: స్థానిక గీతా మందిరంలో శనివారం కూడారై ఉత్సవం నిర్వహించారు. గోదారంగనాథ చిత్రం వద్ద దీపాలు వెలిగించి, 108 చిన్న కుండీల ప్రసాదాలు నివేదించారు.



## ఘనంగా వేంకటేశ్వర కళ్యాణం

అచ్చంపేట: స్థానిక హరిహరక్షేత్రంలోని భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రాత్రి ముక్కోటి ఏకాదశి సందర్భంగా కళ్యాణ వేడుక జరిగింది.

## న్యూస్‌రీల్

### 20 నుంచి కందులు కొనుగోలు



నరసరావుపేట: జిల్లాలో కందులు పండించిన రైతుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రూ.7,550కు ఈ నెల 20వ తేదీ నుంచి కొనుగోలు చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఆర్‌జే కృష్ణారావు శనివారం పేర్కొన్నారు. కందుల కొనుగోలుకు 20వ తేదీ నుంచి ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారని తెలిపారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు రైతులు వెళ్లి పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తమ ఉత్పత్తులను తయారు చేసుకోవాలని తెలిపారు. శనగల కొనుగోలుకు కూడా ఏర్పాట్లు చేయాలని జేసీ సూచించారన్నారు.

### పొన్నూరు విచ్చేసిన ఒడిశా గవర్నర్ హరిబాబు



పొన్నూరు: ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు శనివారం పొన్నూరు వచ్చారు. నిడుబ్రోలుకు చెందిన కేంద్ర మాజీ మంత్రి పాములపాటి అంకినీడు ప్రసాదరావు సతీమణి శివప్రసాదేవి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### నేడు దర్గా టు దుర్గ కాలి నడక

పెదకాకాని: జాతి సమైక్యత కోరుతూ వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టు దుర్గ కాలి నడక నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గా నుంచి విజయవాడలోని దుర్గ గుడికి నడక ప్రారంభమవుతుందని చెప్పారు. 1500 మంది విద్యార్థులతో 33 కిలోమీటర్ల మేర ఈ కాలినడక కొనసాగుతుందని చైర్మన్ పేర్కొన్నారు.

### వైభవంగా గోదాదేవికి పూజలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస కార్యక్రమాలలో శనివారం 27వ రోజు 27వ పాశురాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ శాసనాలతో కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు గోదా అమ్మవారికి సారెను సమర్పించి స్వామి వారి మంగళశాసనాలు అందుకున్నారని పేర్కొన్నారు. కూడారై (పాయసం) మహోత్సవం అత్యంత వైభవంగా జరిగిందని చెప్పారు.

### నేడు సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహావిష్కరణ

తెనాలి: ప్రఖ్యాత సినీ హీరో, నిర్మాత, దర్శకుడు సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆదివారం తెనాలిలో ప్రతిష్ఠించనున్నారు. ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో తెనాలి-విజయవాడ రోడ్డులోని తెనాలి బండ్‌పై సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

# సంక్రాంతి బిజినెస్ డల్ !

- వ్యాపారాలలో కనిపించని సంక్రాంతి కొనుగోళ్లు
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన బేరాలు
- గతేడాది రోజువారీ జిల్లా సగటు వస్త్ర వ్యాపారం రూ.4.5 కోట్లు
- ప్రస్తుతం కేవలం రూ.2 కోట్లకే పరిమితం
- గృహ నిర్మాణ, బంగారం, నిత్యావసర సరకులదీ అదే దారి
- పేద, మధ్య తరగతి వారి కొనుగోలు శక్తి తగ్గడమే కారణం
- ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేక తగ్గిన నగదు ప్రవాహం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ కార్యక్రమాలతో కొనుగోలు శక్తి
- పేదోడి ఖాతాలో ఒక్కపైసా జమ చేయని కూటమి ప్రభుత్వం

సంక్రాంతి అంటేనే సిరుల పండుగ. పంటలు చేతికి అందడంతో రైతుల ఇళ్లు ధాన్యరాశులతో కళకళలాడే సమయం. రైతులు, రైతు కూలీల చేతినిండా డబ్బు లుండటంతో వ్యాపారాలు చక్కగా సాగి అన్ని వర్గాలు సంతోషంగా జరుపుకొనే పండుగ ఇది. అలాంటి పెద్ద పండుగ నేడు బోసిపోతోంది. సంబరాలు కలగానే మిగిలాయి. పేద, మధ్య తరగతి ప్రజల వద్ద నగదు ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో కొనుగోలు శక్తి పడిపోయింది. పండుగ జోష్ పల్నాడు పల్లెల్లో ఏ కోశానా కనిపించడం లేదు. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేరుగా ప్రజలకు లబ్ధి కలిగేది. కూటమి సర్కారు వచ్చాక సంక్షేమ పథకాలేవీ రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



సంక్రాంతి వ్యాపారాలు లేకపోవడంతో పిడుగురాళ్ల ఐలాండ్ సెంటర్‌లో శనివారం సాయంత్రం ఖాళీగా ఉన్న దుకాణాలు

సాక్షి, నరసరావుపేట: గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు ఠంఛనుగా అందడంతో మూడు పూట్ల పేదోడి చేయి నోట్లోకి వెళ్లగలిగింది. రూ.లక్షల కోట్లను నేరుగా ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. కావడంతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులకు మంచి గిరాకీలు లభించి వ్యాపారాలు బాగా జరిగాయి. ఎన్నికల్లో మోసాల కూటమి గద్దెనెక్కడంతో సంక్షేమం కాస్త సంక్షోభంగా మారింది. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలన్నీ అటకెక్కాయి. ఆరు నెలలు పూర్తయినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పేదల చేతిలో ఒక్కపైసా లేదు. ధన ప్రవాహం తగ్గి చిన్న అవసరాలు సైతం వాయిదా వేసుకొనే పరిస్థితి నెలకొంది. రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, వరుస ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాట ధర లభించకపోవడం వంటి కారణాలతో సంక్రాంతి పండుగ హీరో అయిన రైతు దీనస్థితిలో ఉన్నాడు. దీంతో పండుగ హుషారు కనిపించడం లేదు. పరోక్షంగా ఆ ప్రభావం వ్యాపారాలపైనా భారీగానే పడింది. దీంతో దీలాపడ్డామని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిడుగురాళ్ల జానపాడు రోడ్డులో శనివారం సాయంత్రం బోసిపోయిన వీధులు

### సగానికి పైగా తగ్గిన వ్యాపారాలు...

పల్నాడు జిల్లాలో బంగారు, వస్త్ర, కిరాణా వ్యాపారాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. గతంలో జిల్లాలో వస్త్ర వ్యాపారాలు సగటున రోజుకు రూ.4.50 కోట్ల వరకు జరిగేది. ప్రస్తుతం రూ. 2 కోట్లకు పడిపోయింది. సంక్రాంతి పండుగ సీజన్‌లో గతేడాది సుమారు రూ.12–15 కోట్ల వ్యాపారం జరిగేది. ప్రసుత్తం రూ.5 కోట్లు–రూ.6 కోట్లకే పరిమితమైంది. అద్దె షాపులు నడిపేవారు గుమస్తాలకు జీతాలు కూడా చెల్లించే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. బంగారు వ్యాపారానికి జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ల, సత్తెనపల్లి పేరొందాయి. తర్వాత స్థానాల్లో చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 వరకు బంగారం దుకాణాలు ఉండగా.. ప్రస్తుతం రోజుకు సగటున రూ. 5 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఏడాది క్రితం రూ.10 కోట్లకుపైనే వ్యాపారం జరిగేదని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా బంగారం ధరలు పెరగడం, ఉపాధి లేక ప్రజల కొనుగోలు శక్తి భారీగా తగ్గినట్లు చెబుతున్నారు. వీటికి తోడు ఇసుక అధిక ధరల కారణంగా భవన నిర్మాణ పనులు సాగకపోవడం, సిమెంట్, ఐరన్, ఇటుకల నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో సంబంధిత వ్యాపారం పూర్తిగా మందగించింది. నిత్యావసర సరకుల ధరలు పెరగడంతోపాటు ప్రజలకు పనులు లేక, సంక్షేమ పథకాలు అందక పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం కిరాణా వ్యాపారం మీద కూడా పడింది. దీంతో అన్ని వ్యాపారాలు గత ఏడాది నుంచి పూర్తిగా కుదేలయ్యాయి.

### తగ్గిన వస్త్ర, బంగారం వ్యాపారాలు



బంగారం, వస్త్ర వ్యాపారాలు బాగా తగ్గిపోయాయి. రైతుల వద్ద డబ్బులు లేకపోవడం ప్రధాన కారణం. దీంతోపాటు ఇప్పటికీ బంగారు ధర బాగా పెరగటం కూడా ఓ కారణమే. వస్త్ర వ్యాపారులకైతే మధ్యాహ్నం వరకు బోణీ కావడం లేదని మా వ్యాపార మిత్రులు చెబుతున్నారు. దీనికి కారణం ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడమే.

– కపిలవాయి శివప్రసాద్, జ్యూయలరీ వ్యాపారి, నరసరావుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

## రేపటి నుంచి జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

- మొదటి బహుమతి రూ.1.50 లక్షలు
- రెండో బహుమతి రూ.లక్ష

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం నుంచి అన్నంబొట్లవారిపాలెంలో బండలాగుడు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహించే 37వ జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీన పెద్ద సైజు విభాగంలో, 14వ తేదీన జూనియర్స్ విభాగంలో, 15వ తేదీ సబ్ జూనియర్స్ విభాగంలో, 16వ తేదీన సేద్యపు విభాగంలో, 17వ తేదీన పాలపళ్ల విభాగంతోపాటు ఆవుల అందాల పోటీలు కూడా జరుగుతాయని తెలిపారు. 13న జరిగే పెద్ద సైజు విభాగం పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.1.50 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.60 వేలు, నాలుగో బహుమతి రూ.36 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.15 వేలు, ఏడో బహుమతి రూ.10 వేలుగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. పశుపోషకులు, రైతులు ఈ పోటీల్లో ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

- సంక్రాంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అలపర్తి ఎన్‌క్లేవ్, మచ్చవారి పాలెం రోడ్డులో 14న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన ప్రారంభమైందని కమిటీ అధ్యక్షుడు లేళ్ళ నరేంద్ర తెలిపారు. ఈమేరకు భీమావారిపాలెం శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా లేళ్ల నరేంద్ర మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎడ్ల బలప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఎడ్ల బల ప్రదర్శనలో పాల్గొనదలచిన యడ్ల యజమానులు సోమవారం తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. మొదటి విభాగం, ద్వితీయవిభాగం ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. విజేతలుగా నిలిచిన ఎడ్లజతలకు బహుమతులు అందజేస్తారన్నారు.

# ఊరెళ్తే ఇంటికి 'కీ'లకమిదే..

పట్టణానికి చెందిన సుబ్బారావు సంక్రాంతి పండుగకు పిల్లలతో ఊరికి వెళ్లారు. ఆ సమయంలో ఎప్పుడు వెళదామా అనే ఆలోచనలో భద్రత గురించి పట్టించుకోలేదు. తీరా వారం తర్వాత ఇంటికి వచ్చి చూస్తే ఇల్లు గుల్లయ్యింది. ఇంట్లో బీరువాలోని బంగారంతోపాటు నగదు కూడా చోరీకి గురైంది.

నరసరావుపేట రూరల్ మండలంలోని గ్రామానికి చెందిన మంగతాయారమ్మ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. పిల్లలను చూసేందుకు అల్లుడు ఇంటికి వెళితే స్వగ్రామంలోని తన ఇంటిలో దొంగలు పడి ఇల్లు గుల్ల చేశారని వాపోయారు.

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటుతో ఇంటికి రక్షణ
- పోలీసు శాఖ సహకారంతో చోరీలకు అడ్డుకట్ట
- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచన

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలోని అనేక చోట్ల ఇలా దొంగతనం కేసుల నమోదవుతూనే ఉన్నాయి. ప్రధానంగా పండుగ రోజుల్లో ఇల్లు గుల్ల చేసే దొంగలు ఎక్కువయ్యారు. ఈ మేరకు పలు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై పోలీసులు ప్రజలను అప్రమత్తం చేసేందుకు డోర్ లాక్ ఇళ్లకు రక్షణ కంచె కడుతున్నారు. అయితే ఊరికి వెళ్లే వారు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ఫోనులో డౌన్‌లోడ్ చేసుకుని మీ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇక నిశ్చింతంగా ఊరికి వెళ్లి రావచ్చు.

### ఎంతో అవసరం

సంక్రాంతి సెలవులు ఈ సారి పిల్లలతోపాటు ఉద్యోగులకు ఎక్కువగా ఉండడం దొంగలు చేతివాటం చూపే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తూ భద్రత కల్పిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఊరికి వెళ్లే వారి ఇళ్లపై నిఘాకు టెక్నాలజీ సాయంతో తగిన ఏర్పాట్లు చేశారు.



ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై పోలీస్ శాఖ రూపొందించిన యాప్

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో మీ ఇంటి వివరాలు నమోదు చేసుకుంటే చాలు. మీరు తిరిగొచ్చే వరకు పోలీసులే భద్రత కల్పిస్తారు. చీమ చిటుక్కుమన్నా.. నిఘా నేత్రం ద్వారా మీ ఇంటిని కాపాడుకోవచ్చు.

### సాంకేతికతతో పటిష్ట భద్రత



జిల్లా ప్రజలు యాప్‌ను రిజిస్టర్ చేసుకోండి. ఇంటిపై నిఘా ఉంచేందుకు రిక్వెస్ట్ వాచ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. రోజుల పాటు ఇళ్లకు తాళాలు వేసి ఉంటే సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలని ఇప్పటికే మహిళా పోలీసులను ఆదేశించాం. వారిచ్చిన సమాచారంతో ఆ గృహాలనూ సిబ్బంది పర్యవేక్షిస్తారు.

– కంచి శ్రీనివాసరావు, ఎస్పీ, పల్నాడు జిల్లా

# ముత్యాల ముగ్గులు

- 'రంగు'వల్లులతో పల్లెసీమలకు కొత్త కళ
- ధనుర్మాసంలో ముగ్గులకు ప్రాధాన్యత
- సృజనాత్మకంగా తీర్చిదిద్దుతున్న అతివలు

పెదకూరపాడు: రోజూ గడిపే సాధారణ జీవితానికి పండగలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అదే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల ప్రత్యేక. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో పల్లెసీమలు అందాలొలుకుతున్నాయి. లోగిళ్లు అందమైన ముగ్గులతో కనువిందు చేస్తున్నాయి. ధనుర్మాసం నేపథ్యంలో మగువలు, యువతులు తమ ఇంటి లోగిళ్లను రంగవల్లులతో రంగులద్ది అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇంటి రహదారి మట్టిదైతే ముగ్గు, పౌడర్‌తోనూ, సీసీ రోడ్డు అయితే పెయింట్‌తో ముగ్గులు వేస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారాల వద్ద సంక్రాంతి శుభాకాంక్షలు, స్వాగతం అంటూ రంగు రంగులతో అలంకరిస్తున్నారు. మెట్లు, హాలులలో రకరకాల డిజైన్ల ముగ్గులు ఉన్న స్టిక్కర్లను అతికిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇక్కడా ముగ్గులతో ప్రాంగణాలను నింపేస్తున్నారు.

### నేపథ్యమిదీ....

ధనుర్మాసంలో ముగ్గులు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. డిసెంబర్‌లో ధనుర్మాసం భోగితో ముగియనుంది. యువతులు తమ ఇళ్ల ముందు ముగ్గులు చేసి గొబ్బిళ్లతో పూజలు చేయడం ద్వారా మంచి వరుడు లభిస్తారని ఆండాళ్ తల్లి పావన చరిత ద్వారా తెలుస్తోంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతికి పూర్ణ కుంభం, కనుమకు రథం ముగ్గు వేయడం ఆనవాయితీగా వస్తోంది. చుక్కల ముగ్గులు ద్రవిడ సంప్రదాయంగానూ, గీత ముగ్గు ఆర్య సంప్రదాయంగానూ చూస్తారు. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా చిరుజీవులకు ఆహారం లభిస్తుంది.



ముగ్గులు వేస్తున్న మహిళలు

### జ్ఞాన సముపార్జన....

విజ్ఞానం అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లో ముగ్గుల ద్వారా జ్ఞానాన్ని అందించారనే ప్రచారం ఉంది. కొమ్మారెమ్మ, పక్షులు, మృగాలు, పురాణ గాథల ఘట్టాలను ముగ్గులో వేసి అవగాహన పెంచేవారు. ఆసక్తి, ప్రణాళికతో కూడిన ప్రయత్నం ఇది. ఏకాగ్రత తదితర శాస్త్రీయ అంశాలు ముగ్గులు వేయడం వెనుక ఉన్నాయి.

### ఎన్నో రకాలు....

చేతి వేళ్ల మధ్యల్లోంచి ముగ్గును జార విడిచే పద్ధతి సాధారణమైనది. ఆధునిక కాలంలో అనేక నూతన పద్ధతులు వచ్చాయి. ముగ్గు రంగు రంగు పైడర్లు, పెయింట్లు, బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గులు, అచ్చు, మెట్లపై స్టిక్కర్లు, ఆరు తిక్, మరో ఆరు లైట్ మొత్తం 12 రకాల ముగ్గులను చుక్కలు, మెలికలు, డిజైన్స్, హాస్యం బొమ్మలు, కూరగాయలు, దేవతామూర్తులు, సంగీత సాధనాలతో నింపుతున్నారు.

### ఖర్చుకు సైతం సై....

పాతకాలంలో ముగ్గు అంటే తెలుపు రంగే అన్నట్లు ఉండేది. ఇప్పుడు పౌడర్ల రూపంలో ఉన్న అనేక రంగులు ఉనికిలోకి వచ్చాయి. 50 గ్రాముల రంగును రూ.10కి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ముగ్గు పుస్తకాలు కొనుగోలు, మొబైల్ ఫోన్ల ద్వారా డిజైన్లను డౌన్‌లోడు చేసేందుకు రీచార్జ్‌లు, న్యూస్ పేపర్లు కొనుగోలు నిమిత్తం ఖర్చు చేసేందుకు సైతం వెనకాడని పరిస్థితి ఉంది.

# పండుగ ప్రయాణాలు

- సంక్రాంతి రద్దీతో కిక్కిరిసిన బస్సులు
- ప్రయాణికులకు తగ్గట్లు సర్వీసులు కరవు
- ఏ రూటుకైనా గంటలకొద్దీ ఎదురుచూపులే
- ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ హైదరాబాదుకే సరి
- సొంత గ్రామాలకు బయలుదేరిన విద్యార్థులు
- అన్నివర్గాల వారికీ తప్పని చిక్కులు

నరసరావుపేట: ఆర్టీసీ అధికారులకు రాబడిపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్రాంతి రద్దీకి తగినట్లు సర్వీసులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఆర్టీసీ డిపో శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని సొంత గ్రామాలకు బయలుదేరే వారితో బస్సులన్నీ కిక్కిరిసి పోయాయి. రద్దీకి తగ్గట్లుగా బస్సులు లేకపోవటంతో గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డిపో నుంచి వివిధ ప్రదేశాలకు వెళ్లేందుకు ప్రైవేటు హైర్ బస్సులతో పాటు 89 బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నారు. దీనిలో ఎక్కువ భాగం నరసరావుపేట–గుంటూరుల మధ్యే తిరుగుతుంటాయి. డిపో ఆదాయంలో ప్రధానంగా ఈ రూట్ నుంచే వస్తుంది. వినుకొండ, సత్తెనపల్లిల నుంచి నరసరావుపేటకు తిరిగే బస్సులను ఆ డిపోల వారే నిర్వహిస్తున్నారు.



బస్టాండ్‌లో బస్సులు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

### అందరికీ పడిగాపులే

ప్రైవేటు విద్యాలయాలకు సెలవులు ప్రకటించటంతో హాస్టళ్లలో ఉంటున్న పలువురు విద్యార్థులు సొంత గ్రామాలకు బయలుదేరారు. దీంతో డిపో ప్రాంగణం యువతతో నిండిపోయింది. పండగ సందర్భంగా చుట్టాలున్న గ్రామాలకు బయలుదేరిన వారు, పట్టణానికి వచ్చి కావాల్సిన సరుకులు, దుస్తులు కొనుగోలు చేసి తిరిగి గ్రామాలకు వెళ్లేవారితో బస్సులు రద్దీగా కన్పించాయి. ఏ బస్సు వచ్చి టెర్మినల్‌లో ఆగినా బస్సు నుంచి దిగేవారిని కూడా సక్రమంగా దిగనీయకుండా బస్సు ఎక్కేందుకు ప్రయత్నాలు చేశారు. బస్సు రాగానే సీటు దక్కించుకునేందుకు కిటికీల నుంచి చేతిరుమాళ్లు, కండువాలు, చిన్నపాటి వస్తువులు సీట్లలో వేసి తమ సీట్లను రిజర్వు చేసుకోవటం కన్పించింది. దీంతోపాటు హైదరాబాదులో ఉన్న వారిని సొంత గ్రామాలకు తీసుకొచ్చేందుకు ఈ నెల 9వ తేదీ నుంచి ఆర్టీసీ 137 బస్సులను తిప్పుతోంది. అయితే దీనికోసం రెగ్యులర్‌గా గుంటూరు, విజయవాడ, పిడుగురాళ్ల, ఇతర ప్రదేశాలకు తిరిగే బస్సులను హైదరాబాదుకు వినియోగించటంతో పండగ రద్దీకి అనుగుణంగా బస్సుల ఏర్పాటులో సంస్థ విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్‌లో తమ సొంతగ్రామాలకు వెళ్లేందుకు వచ్చే బస్సుల కోసం ప్రయాణికులు గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డిపో మేనేజర్ జీవీఎస్ కుమార్‌ను దీనిపై వివరణకు సంప్రదించేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల వైపు వెళ్లే బస్సుల కోసం ఎదురుచూపులు

## క్లుప్తంగా

### ఓబన్న తెగువ స్మరణీయం



**నరసరావుపేట:** భయమెరుగక సంచార తెగల సైన్యాన్ని సమర్థంగా నడిపిన వీరుడు వడ్డే ఓబన్న అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీతోపాటు పలువురు అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ .. నాస్యం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో సైనాధ్యక్షుడిగా ఓబన్న వీరోచిత పాత్ర పోషించారని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ ఎ.ఆర్.సత్తిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గుంటూరు జిల్లాలో..**



**నగరంపాలెం:** స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి ప్రాంత యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న అని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కొనియాడారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఓబన్న వీరోచితంగా పోరాడారని తెలిపారు. రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు జయరాంప్రసాద్ (పశ్చిమ), శివాజీరాజు (సీసీఎస్), ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

### భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగలబెట్టండి!

సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

**లక్ష్మీపురం:** రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పదేపదే విద్యుత్ భారాలు మోపడానికి నిరసనగా ఈ నెల 13న భోగి మంటల్లో బిల్లులు దహనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాయలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలలో వచ్చిన బిల్లులో 2022 ఏప్రిల్, 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న కరెంట్‌కు, ఇటీవలే 2024లో నవంబర్‌లో చెల్లించిన కరెంటు బిల్లులకు కూడా సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు.ఈ నెలలో కట్టిన విద్యుత్ బిల్లులకు కూడా వచ్చే నెలలో సర్దుబాటు చార్జీలపేరుతో ప్రజలపై భారాలు వేసేదానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దొడ్డిదారిన ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం మానుకుని, గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### గణపవరంలో భారీ చోరీ

30 సవర్ల బంగారం, రూ.లక్షకుపైగా నగదు దొంగతనం



**నాదెండ్ల:** గణపవరం గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇంటిలో సుమారు 30 సవర్ల బంగారం, రూ.లక్షకు పైగా నగదు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన తూబాటి శేషగిరిరావు దంపతులు ఈ నెల 10న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు పగలగొట్టి ఉండటం గమనించారు. బీరువా పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు నాదెండ్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.పుల్లారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. గుంటూరు క్లూస్‌టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని సాక్ష్యాధారాలు సేకరించారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



# ఉద్యోగం, స్థలం ఇప్పిస్తానని టోకరా

రూ. 59 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులో వ్యక్తి అరెస్టు



లవ్‌బాబు (ఫైల్)

**మంగళగిరి (తాడేపల్లి రూరల్):** ఉద్యోగాలు ఇప్పిస్తానని పెద్ద మొత్తంలో నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని మంగళగిరి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు శ్రీనివాసాపురానికి చెందిన చుక్కా బాబు అలియాస్ లవ్‌బాబు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళగిరి మండలం ఆత్మకూరులో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి స్నేహితులతో కలసి మోసం చేయడమే పనిగా పెట్టుకున్నాడు. స్నేహితుల ద్వారా ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని వాటిల్లో తిరుగుతూ కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫొటోలు దిగేవాడు. ఈ క్రమంలో మంగళగిరి బస్టాండ్ వద్ద ఇల్లు అద్దెకు ఇవ్వబడును అనే బోర్డు చూసి, అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. ఇల్లు అద్దెకు కావాలంటూ యజమాని దాసరి రామమోహనరావును పరిచయం చేసుకున్నాడు. ఆయన తమ్ముడికి ఉద్యోగ అవసరం ఉందని తెలుసుకుని హైకోర్టులో ఇప్పిస్తానని నమ్మబలికాడు. అప్పటికే అతని ఫోన్‌లో దిగిన ఫొటోలు చూపించాడు. ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని, కచ్చితంగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఆ మాటలు నమ్మి రామమోహనరావు రూ. 10 లక్షలు ఇచ్చాడు. అనంతరం హైకోర్టులో స్టెనోగా పనిచేసే అరుణ్ అనే వ్యక్తి చనిపోయాడని, అతని పేరున ఉన్న రెండు ఎకరాలు హైకోర్టు న్యాయమూర్తుల కస్టడీలో ఉందని తెలిపాడు. రూ. 49 లక్షలు ఇస్తే ఆ భూమిని నలుగురు జడ్జిలతో రామమోహనరావు పేరున రిజిస్టర్ చేస్తానని నమ్మబలికాడు. అతడి దగ్గర నుంచి ఉద్యోగం, భూమి నిమిత్తం మొత్తం రూ. 59 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత వాటి గురించి రామమోహనరావు అడగ్గా అదిగో ఇదిగో అంటున్నాడు. దీంతో 2024 నవంబర్‌లో చుక్కా బాబు అతని స్నేహితులు వంశీకృష్ణ, తరుణ్, అతని కుటుంబ సభ్యులపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రామమోహనరావు ఫిర్యాదు చేశాడు. శనివారం చుక్కా బాబు విజయవాడలో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ వినోద్‌కుమార్ సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గతంలో చుక్కా బాబుపై పోక్సో యాక్ట్, 498ఏ, చీటింగ్ కేసులతో పాటు పలు కేసులు వివిధ ప్రాంతాల్లో నమోదైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లు గానీ, ఇలాంటి వ్యక్తులను గానీ ఎవరూ నమ్మవద్దని సీఐ సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వినోద్‌కుమార్ కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్

# మేడికొండూరులో ప్రొటోకాల్ ఉల్లంఘన

- దళిత ఎంపీపీ మన్నవ స్వప్నకు అవమానం
- సీసీ రోడ్ల శంకుస్థాపనకు పిలిచి వచ్చేలోగా ప్రారంభించి అవమానించారని ఆవేదన

**తాడికొండ:** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మేడికొండూరు మండలంలో దళిత ఎంపీపీ మన్నవ స్వప్నకు అవమానం జరిగింది. ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఓ ఎస్సీ మహిళకు శంకుస్థాపన ప్రారంభోత్సవాల్లో ప్రాధాన్యత ఇవ్వలేదు. కార్యక్రమానికి ఆహ్వానించి ఆమె వచ్చేలోగా టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి మరీ శంకుస్థాపన చేసి అవమాన పరిచారు. మేడికొండూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన ఉందంటూ ఎంపీడీవో చందన ఆహ్వానించారు. ఆమె ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎంపీపీ మన్నవ స్వప్నకు చేదు అనుభవం ఎదురైంది. అప్పటికే స్థానిక సర్పంచ్ నాగమణితో శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేసి కూర్చున్నారు. దీనిపై స్వప్న ఎంపీడీవోను ప్రశ్నించగా తనకు టీడీపీ నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే ఆలా చేశానని తెలిపింది. ఎస్సీ నియోజకవర్గంలో దళిత ఎంపీపీ అయిన తనను అవమానించేలా వ్యవహరించడం, అవమానించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ మన్నవ స్వప్న తెలిపారు.



మేడికొండూరులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

**దళిత మహిళననే చిన్నచూపు**



దళిత మహిళననే తనపై చిన్నచూపు చూస్తూ టీడీపీ నాయకులు అడుగడుగునా అవమానిస్తున్నారు. ప్రోటోకాల్ ప్రకారం తనకు ఇవ్వాల్సిన స్థానం ఇవ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రజా ప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత విస్మరించి అవమానించడంపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తా

– మన్నవ స్వప్న, ఎంపీపీ, మేడికొండూరు.

# చేనేతలు రాజకీయంగా బలపడాలి

ఏఐడబ్ల్యూఎఫ్ జాతీయ అధ్యక్షులు బండారు

**మంగళగిరి (తాడేపల్లి రూరల్):** రాజకీయంగా బలపడడానికి చేనేత వర్గాలవారందరూ కలసికట్టుగా ముందుకు రావాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యూఎఫ్) జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఆర్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రథమ నూతన సంవత్సర క్యాలెండర్‌ను చేనేత నేతల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ చేనేత వర్గాలు వారు రాజకీయంగా మరింత ఎదగాలని తెలిపారు. చేనేత నాయకులందరితో కలసి ఫిబ్రవరి 2న గన్నవరంలో చేనేత ప్రముఖులతో సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సభ ఉద్దేశం, లక్ష్యాలపై చర్చిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ చేనేతలను 18 కులాలుగా విభజించడం కన్నా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగు ఉపకులాలుగా విభజించి వారికి నేతన్న నేస్తం, ముద్ర లోన్లు వచ్చేలా చేశామని తెలిపారు. 18 ఉప కులాలుగా విభజించడం సరికాదని, చిన్న కులాలన్నింటిని కలుపుకుని చేనేత కులం ఒక్కటిగా ఏర్పడాలని కోరారు. ఇప్పటికైనా అందరూ ఐక్యంగా ఉండి పోరాడి, వీటన్నింటిని సాధించే దిశగా అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిరాల సరళాదేవి, ఆలిండియా వీవర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సమతం రమణా మహేష్, రాష్ట్ర అధ్యక్షులు ఎనిమల శివరామప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, లేపాక్షి కార్పొరేషన్ మాజీ చైర్మన్ విజయలక్ష్మి, మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, చేనేత నాయకులు అవ్వారు ముసలయ్య, మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు ఆనంద ప్రసాద్

### కీసర టోల్‌ప్లాజా వద్ద పండగ సందడి

**కంచికచర్ల:** సంక్రాంతి కోసం ఇతర రాష్ట్రాల్లో నివసించే ఏపీ ప్రజలు వాహనాల్లో సొంతూర్లకు బయలుదేరారు. దీంతో మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం వాహనాలు భారీగా బారులు తీరాయి. ప్లాజా నిర్వాహకులు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఫాస్టాగ్ సిస్టం ఏర్పాటు చేయటంతో వాహనాల రాకపోకలకు సులభతరంగా మారింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి పది గంటల వరకు 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లాయని ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇరువురికి తీవ్ర గాయాలు

**శావల్యాపురం:** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇరువురుకు తీవ్ర గాయాలైన సంఘటన బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామ సమీపాన వంతెనపై శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాలు సంక్రాంతి పర్వదినం సందర్భంగా విజయవాడ నుంచి ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి స్వగ్రామానికి భార్యభర్తలు తన కుమారుడు ముగ్గురు కలిసి బైకుపై బయలు దేరారు. ఈక్రమంలో వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న బైకును ఆదుపుతప్పి ఢీకొట్టింది. ఇందులో భాగంగా ప్రమాదం జరిగిన కొద్దిపాటి దూరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు సమాచారం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని రక్తగాయాలతో భాదపడుతున్న పెద చెన్నకేశవులు, లక్ష్మీదేవి, అభిచందులను 108 అత్యవసర వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాల్లో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి మృతి చెందినట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు. విషయాన్ని సంతమాగులూరు మండలం పోలీసు వారికి సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.



చిన్నారిని వైద్యశాలకు తరలిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

# అదృశ్యమైన వ్యాపారి మృతి



బ్రహ్మారెడ్డి (ఫైల్)

**రెంటచింతల:** మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వ్యాపారి పేరం బ్రహ్మారెడ్డి (41) ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం అయినట్లు ఈ నెల 6 వ తేదీన ఆయన భార్య సుజాత పోలీసులను ఆశ్రయించారు. తన భర్త 1వ తేదీ సాయంత్రం వ్యాపారం నిమిత్తం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిస్సింగ్ కేసు నమోదైంది. మరోవైపు శుక్రవారం ఒంగోలు జిల్లా కురిచేడు మేజర్ కాల్వలో ఓ మృతదేహం కొట్టుకొచ్చినట్లు, ఒంగోలు జనరల్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు అక్కడి పోలీసులు స్థానిక ఎస్ఐ సీహెచ్ నాగార్జునకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సూచన మేరకు బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో చూపించిన మృతదేహం బ్రహ్మారెడ్డిది కాదని తెలిసింది. మార్చురీ వాచ్‌మెన్‌కు తాము బ్రహ్మారెడ్డి అనే వ్యక్తి కోసం వచ్చామని కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో ఈ నెల 7వ తేదీన ఒంగోలు సమీపంలోని నంద్యాల గ్రామంలో తీవ్ర జ్వరంతో కిందపడిన ఓ వ్యక్తి కనిపించడంతో కొందరు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారని వాచ్‌మెన్ తెలిపాడు. వారు ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో ఆయన్ను చేర్పించారని, చికిత్స పొందుతూ అదే రోజు గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నాడు. మృతదేహం చూపించడంతో అది బ్రహ్మారెడ్డిదేనని కుటుంబ సభ్యులు, బంధువులు గుర్తించారు. రెంటాల గ్రామంలో ధాన్యం, మిర్చి వ్యాపారం చేసే బ్రహ్మారెడ్డికి భార్య సుజాత, కుమారులు శ్రీధర్ రెడ్డి, తేజారెడ్డి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శనివారం తెలిపారు.

# కనకదుర్గ వారధిపై ట్రాఫిక్ జామ్

- గంటసేపు నిలిచిన ట్రాఫిక్
- అప్రమత్తమైన పోలీసులు
- మరమ్మతులకు గురైన వాహనం తొలగింపు
- ఐదు నిమిషాల్లో మరో రోడ్డు ప్రమాదం
- మళ్లీ నిలిచిపోయిన ట్రాఫిక్

**తాడేపల్లి రూరల్:** విజయవాడ నుంచి గుంటూరు వెళ్తున్న ఓ లారీ మరమ్మతులకు గురై శనివారం కనకదుర్గ వారధిపై నిలిచిపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అప్రమత్తమైన తాడేపల్లి ట్రాఫిక్ పోలీసులు ఆ వాహనాన్ని క్రేన్ సహాయంతో తొలగించారు. అప్పటికే కనకదుర్గ వారధి 16 నంబర్ పిల్లర్ నుంచి కుంచనపల్లి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. తాడేపల్లి ట్రాఫిక్ ఎస్.ఐ నారాయణ క్రేన్ సహాయంతో లారీని వారధి అవతలి వరకు తీసుకు వెళ్లారు. ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సమయంలో గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో ఒక వాహనాన్ని మరో వాహనం ఢీకొంది. దీంతో ట్రాఫిక్ మరోసారి నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పది మంది పోలీసులు కష్టపడి క్లియర్ చేశారు.



వారధిపై మరమ్మతులకు గురైన లారీని తీసుకు వెళుతున్న క్రేన్

# ఐసీసీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

- అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు
- జెడ్ఆర్‌యూసీసీ సభ్యునిగా ఆతుకూరి ఆంజనేయులు నియామకం

**నగరంపాలెం:** రానున్న రోజుల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ)ను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్తామని అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. జిన్నా టవర్ కూడలిలోని కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐసీసీ పరిధిలోని వ్యాపారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతామని చెప్పారు. పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షునిగా, ఎస్‌సీఆర్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యునిగా నియమితులైన ఆతుకూరి ఆంజనేయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు రైల్వేకు సంబంధించి సమస్యల్ని తన దృష్టికి తేవాలని కోరారు. బోగీల పెంపు, రైళ్ల నిలుపుదల చేయాల్సిన స్టేషన్లు, కొత్త మార్గాలకు ఏర్పాటు వంటి విషయాలపై జోనల్ సమావేశంలో ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షులు టి.ఎల్.వి.వీరాంజనేయులు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్‌కుమార్, మాజీ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఆతుకూరి ఆంజనేయులను సత్కరిస్తున్న అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు